# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

**నమస్తే తెలంగాణ**

## బాండ్లపై సుప్రీం వేటు

**నరేంద్రమోదీ** నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అత్యుత్సాహంతో అమలు చేస్తున్న ఎన్నికల బాండ్ల పథకంపై సుప్రీంకోర్టు కొరడా ఝుళిపించింది. ఆ పథకం రాజ్యాంగ విరుద్ధమని చరిత్రాత్మకమైన తీర్పు వెలువరించింది. ఈ పథకం సమాచార హక్కును ఉల్లంఘిస్తున్నదని ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం స్పష్టం చేసింది. ఇది ఏకాభిప్రాయ తీర్పుగా వెలువడటం గమనార్హం. సర్వోన్నత న్యాయస్థానం ఈ కేసులో ప్రధానంగా రెండు అంశాలను పరిశీలించింది. కార్పొరేట్లు రాజకీయ పార్టీలకు బాండ్ల ద్వారా 'స్వచ్ఛందంగా' చెల్లించే చందాల సమాచారం గోప్యంగా ఉంచడం చెల్లుతుందా? తదనుగుణంగా ప్రజా ప్రాతినిధ్య చట్టానికి, ఆదాయపు పన్ను చట్టానికి, కంపెనీల చట్టానికి చేసిన సవరణలు చెల్లుబాటు అవుతాయా? అనేది మొదటిది. రెండోది.. కార్పొరేట్లు రాజకీయ పార్టీలకు 'అపరిమితమైన' చందాలు సమర్పించుకోవడానికి సంబంధించి కంపెనీల చట్టానికి చేసిన మరో సవరణ రాజ్యాంగబద్ధత గురించి. రెండు అంశాల్లోనూ పథకానికి ప్రతికూలంగానే కోర్టు తీర్పు వెలువడింది.

'ఓటుహక్కును సమర్థంగా వినియోగించుకోవాలంటే రాజకీయ పార్టీలకు అందుతున్న నిధుల సమాచారం తెలిసి ఉండటమనేది తప్పనిసరి' అని ప్రధాన న్యాయమూర్తి నొక్కిచెప్పడం ఈ పథకంలో పారదర్శకత లోపించడాన్ని ఎత్తిచూపుతున్నది. రాజ్యాంగంలోని 19(1)(ఎ) అధికరణాన్ని ఇది ఉల్లంఘిస్తున్నదని ఆయన తేల్చిచెప్పారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఈ తీర్పు బీజేపీకి పెద్ద ఎదురుదెబ్బేనని చెప్పాలి. బాండ్ల జారీని తక్షణమే నిలిపివేయాలని ఈ పథకాన్ని అమలు చేస్తున్న ఎస్‌బీఐని కోర్టు ఆదేశించింది. అంతేకాకుండా ఇప్పటివరకు నగదుగా మార్చుకోని బాండ్లను పార్టీలు వెనక్కి ఇచ్చేయాలని కూడా స్పష్టం చేసింది. మధ్యంతర ఉత్తర్వులు జారీచేసిన 2019 ఏప్రిల్ 12 నుంచి ఇప్పటి వరకు మొత్తం అన్ని బాండ్ల వివరాలను సమర్పించాలని ఎస్‌బీఐకి సూచించింది. అదేవిధంగా ఎలక్టోరల్ బాండ్ల ద్వారా నిధులు పొందిన రాజకీయ పార్టీల వివరాలూ తెలపాలని పేర్కొన్నది. ఈ రెండు వచ్చే మార్చి 6వ తేదీలోగా జరగాలని గడువు కూడా విధించింది.

నిర్ణీత పరిస్థితుల్లో కంపెనీలు రాజకీయ పార్టీలకు నిధులు సమకూర్చవచ్చని కంపెనీల చట్టం (2013) 182వ నిబంధన అనుమతిస్తున్నది. అయితే 2017లో ఫైనాన్స్ చట్టానికి సవరణలు చేయడం ద్వారా మోదీ సర్కార్ అనేక మినహాయింపులు అమల్లోకి తెచ్చిన సంగతి తెలిసిందే. వీటి ఆధారంగా 2018 నుంచి బాండ్ల పథకం అమల్లోకి వచ్చింది. 2018 నుంచి 2022 మార్చి వరకు జారీ అయిన మొత్తం ఎలక్టోరల్ బాండ్లలో 57 శాతం, అంటే రూ.5,271 కోట్లు బీజేపీ కోశాగారంలోకి వెళ్లాయి. తర్వాతి స్థానంలో ఉన్న కాంగ్రెస్‌కు రూ.951 కోట్లు మాత్రమే దక్కడం పథకంలో ఉన్న మొగ్గను సూచిస్తున్నది.

రాజకీయ చందాలకు చట్టబద్ధమైన నిధులను నియంత్రిత బ్యాంకింగ్ మార్గాల ద్వారా సేకరించడాన్ని ప్రోత్సహిస్తున్నామని, చందాలు ఇచ్చుకునేవారు రాజకీయ వేధింపులకు గురికాకుండా ఉండేందుకు పేర్లను గోప్యంగా ఉంచడం అవసరమని ప్రభుత్వం చేసిన వాదనను ధర్మాసనం తోసిపుచ్చింది. కంపెనీలు చందాలు ఇస్తున్నాయంటే బదులుగా ఏదైనా లబ్ధి పొందాలనే ఆలోచన దాని వెనుక దాగి ఉండే అవకాశాలు ఉంటాయని ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ అభిప్రాయపడ్డారు. అంటే ఇచ్చిపుచ్చుకునే ధోరణి (క్విడ్ ప్రోకో) ఇక్కడ పనిచేస్తుందని స్పష్టం చేశారు. స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక ఎన్నికల ప్రక్రియకు ఈ ఇచ్చిపుచ్చుకోవడం అనేది గొడ్డలిపెట్టు వంటిదని హెచ్చరించారు. బాండ్లు పారదర్శకతకు మసిపూస్తాయని, నల్లధనాన్ని తెలుపు చేసుకునేందుకు దుర్వినియోగమవుతాయని గత నవంబర్‌లో ఈ కేసు విచారణ సందర్భంగా కోర్టు చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు గుర్తు చేసుకోవాల్సిన అవసరముంది.

సుప్రీంకోర్టు తీర్పు రాబోయే మాసాల్లో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికలపై ప్రభావం చూపుతుందని చెప్పవచ్చు. పాలకపక్షం ప్రాపకం కోసం పాకులాడని కార్పొరేట్ సంస్థ ఉంటుందా? అని ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ వంటి ఆర్థికవేత్తలు సందేహాలు వ్యక్తం చేయడం ఈ సందర్భంగా గుర్తుంచుకోవాలి. కార్పొరేట్ చందాలపై సుప్రీంకోర్టు తీర్పు స్వాగతించదగ్గదే. అయితే అసలు సమస్య ఎన్నికల వ్యయం, దానిని వెన్నంటి ఉండే అవినీతి. వ్యక్తిగత చందాల ద్వారా అవినీతి జరగదనే గ్యారంటీ ఏమీ ఉండదనేది వాస్తవమే. ఎన్నికల వ్యయం ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయి, రాజకీయ పార్టీలు కార్యకర్తల చందాల మీద మాత్రమే ఆధారపడే రోజులు ఎప్పుడో పోయాయి. అదేవిధంగా ఓటర్లందరూ విద్యావంతులై, అవినీతి గురించి చైతన్యం కలిగినవారైతే పరిస్థితి వేరేగా ఉంటుంది. అటు అవినీతికి కళ్లెం పడుతుంది, ఇటు ఎన్నికల వ్యయమూ తగ్గిపోతుంది. కానీ, ప్రస్తుత నేపథ్యంలో అవినీతికి దారితీసే లొసుగులను చక్కదిద్దడం తక్షణావసరం. అదే సమయంలో ఎన్నికల వ్యయాన్ని, అవినీతిని తగ్గించేందుకు సాంకేతికతను వినియోగించడం తప్పనిసరి. ఆధార్‌తో ఓటును అనుసంధానించడం వంటి సాంకేతిక చర్యల ద్వారా దీనిని సాధించవచ్చు. తగ్గించిన వ్యయాన్ని కూడా పార్టీలు చట్టబద్ధమైన మార్గంలో పొందేందుకు న్యాయమైన విధానాలు ప్రవేశపెట్టాల్సి ఉందని చెప్పకతప్పదు.

## మరుభూమిని తలపిస్తున్న ఢిల్లీ



*మోదీ సర్కార్ తీరుతో ఢిల్లీ మరుభూమిని తలపిస్తున్నది. బారికేడ్లు, ఇనుపకంచెలతో ఢిల్లీలో బీజేపీ ప్రభుత్వం యుద్ధ వాతావరణాన్ని సృష్టిస్తున్నది. గతంలో రైతన్నలను ఉగ్రవాదులుగా చిత్రీకరించింది కూడా ఈ సర్కారే. అసలు ఎవరు ఉగ్రవాదులు? తమ డిమాండ్ల కోసం పోరాడుతున్న రైతులా? అన్నదాతల సమస్యలను పరిష్కరించకుండా వారిపైనే కేసులు బనాయిస్తున్న ప్రభుత్వమా?*

**- ఎంకే స్టాలిన్,** తమిళనాడు ముఖ్యమంత్రి

# కనీస మద్దతు కోసం కదిలిన కర్షకులు

దేశ రైతాంగం మరోసారి రోడ్డెక్కింది. అన్నదాత ఆగ్రహం ఢిల్లీని చుట్టుముట్టి ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. ట్రాక్టర్లపై తరలివచ్చిన రైతన్నలపై పోలీసులు లాఠీలతో విరుచుకుపడుతూ, బాష్పవాయుగోళాలు విసురుతుండటం మనం చూస్తూనే ఉన్నాం. రైతులు ఎప్పటిలాగే సర్వసన్నద్ధంగా వచ్చారు. తిండీతిప్పలే కాదు, బాష్పవాయు గోళాలను ఎదుర్కొనేందుకు అవసరమైన సరంజామా తెచ్చుకున్నారు. అటు సర్కారు మాత్రం రైతులను ఎలాగైనా లొంగదీసుకొని వెనక్కి పంపాలని శతధా ప్రయత్నిస్తున్నది. ఓ వైపు చర్చలంటూనే.. మరోవైపు నిర్బంధాన్ని తీవ్రతరం చేస్తుండటం మోదీ ప్రభుత్వ ఆలోచనాధోరణిని స్పష్టం చేస్తున్నది.



**తుమ్మలపల్లి రఘురాములు**
91827 77750




రైతులు గతంలో ఏడాదికిపైగా జరిపిన చరిత్రాత్మక పోరాటం ఈ సందర్భంగా మనకు గుర్తుకు రాక మానదు. మూడు వ్యవసాయ నల్లచట్టాలకు వ్యతిరేకంగా అప్పట్లో కర్షకలోకం జరిపిన ఆ అవిశ్రాంత పోరాటాన్ని అణచివేసేందుకు ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర సర్కార్ సామ, దాన, దండ, భేదోపాయాలను ఉపయోగించింది. అయినా ఆందోళన అదుపులోకి రాకపోవడంతో దిగివచ్చింది. ప్రధాని మోదీ స్వయంగా కెమెరా ముందుకొచ్చి వివాదాస్పద చట్టాలను ఉపసంహరించుకుంటున్నట్టు ప్రకటించారు. అంతేకాకుండా క్షమాపణలు కూడా చెప్పారు. రైతుల డిమాండ్లు అన్నిటినీ పరిశీలించి, పరిష్కరిస్తామని హామీ కూడా ఇచ్చారు. ఆ డిమాండ్లలో కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలనేది ముఖ్యమైనది. రైతాంగాన్ని కార్పొరేట్ ప్రపంచానికి కట్టుబానిసలను చేసే నల్లచట్టాలు ఉపసంహరించుకోవడం గొప్ప విజయమే. కానీ, కనీస మద్దతు ధర అంతకన్నా ముఖ్యమైన జీవన్మరణ సమస్య రైతులకు.

కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించేందుకు కేంద్రం సంసిద్ధంగా లేదనేది తెలిసిందే. ఇప్పుడు రైతులు ఢిల్లీపై సమరభేరి మోగించడానికి రుణమాఫీ, రైతులు, రైతుకూలీలకు పింఛన్లు, ఢిల్లీ ఆందోళన మృతుల కుటుంబాలకు పరిహారం, ఉద్యోగం, 2020 విద్యుత్తు బిల్లు ఉపసంహరణ, వ్యవసాయానికి ఉపాధిహామీ పనులను రెట్టింపు చేయడం, మిరప, పసుపుపై జాతీయ కమిషన్ల ఏర్పాటు వంటి పలు ఇతర డిమాండ్లతో పాటు కనీస మద్దతు ధర కూడా ఓ ముఖ్య కారణం. ఎందుకంటే, రైతులు తమ వ్యవసాయ దిగుబడులకు గిట్టుబాటు ధర కోరుకోవడం ఎంతైనా సమంజసమే. కానీ, పంట దిగుబడుల మార్కెట్లో కొనుగోలుదార్లదే పైచేయి. వారిలో కారుచౌకగా వ్యవసాయ ఉత్పత్తులను ఎగరేసుకుపోవాలని చూసే కార్పొరేట్లూ ఉంటారు. ఈ మార్కెట్లోకి సరుకు తెచ్చే రైతుకు కొనుగోలుదారు ఇచ్చిన ధరను పుచ్చుకొని ఇంటికి పోవడం మినహా గత్యంతరం ఉండదు. ఎన్నో ఆటుపోట్లను తట్టుకొని పంటను పండించే రైతుకు చివరి ఘట్టంలో అరిగోస పెట్టే అతిపెద్ద సమస్య ఇదే. ఈ అంశంపై ఆర్థికవేత్తల మధ్య ఏకాభిప్రాయం లేకపోవడం గమనార్హం.

**రైతులు తమ వ్యవసాయ దిగుబడులకు గిట్టుబాటు ధర కోరుకోవడం ఎంతైనా సమంజసమే. కానీ, పంట దిగుబడుల మార్కెట్లో కొనుగోలుదార్లదే పైచేయి. వారిలో కారుచౌకగా వ్యవసాయ ఉత్పత్తులను ఎగరేసుకుపోవాలని చూసే కార్పొరేట్లూ ఉంటారు.**

కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తే కేంద్రం హీనపక్షం రూ.10 లక్షల కోట్లు కేటాయించాల్సి ఉంటుందనేది వ్యతిరేకులు ముందుకు తెస్తున్న వాదన. ఇది మొన్నటి తాత్కాలిక బడ్జెట్‌లో మౌలికరంగానికి కేంద్రం కేటాయించిన రూ.11 లక్షల కోట్లకు దగ్గరగా ఉంది. పైగా మద్దతు ధర ఎటూ వస్తుంది కనుక పనికిమాలిన పంటలు రైతులు పండిస్తారనేది వీరు సన్నాయినొక్కులు నొక్కుతున్నారు. ధర మార్కెట్ అవసరాలను బట్టి ఉండాలని, పంటలు కూడా డిమాండ్‌ను బట్టే వేయాలని వారంటున్నారు. రైతులకు ధర కన్నా ఆదాయం సమకూర్చడం మంచిదని మరికొందరు ఆర్థికవేత్తల మాట. ఈ ఆదాయం ఏ రూపంలో ఉండాలి? అంటే కేంద్రం అనుసరిస్తున్న కిసాన్ సమ్మాన్ తరహాలో రైతుకింత అని లేదా తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుబంధు తరహాలో ఎకరానికి, కారుకు ఇంత అని పెట్టుబడి సాయం అందించాలనేది ఈ వర్గం ఆర్థికవేత్తల అభిప్రాయం. దీని ద్వారా రైతుకు పెట్టుబడి భరోసా లభిస్తుంది. ఏ పంట వేయాలనేది తన విజ్ఞత మీద, అంటే మార్కెట్ డిమాండ్‌పై ఆధారపడి ఉంటుంది.

అయితే మద్దతు ధర లేకపోతే రైతుకు మార్కెట్ ఆటుపోట్ల నుంచి రక్షణ ఉండదనేది తెలిసిందే. రైతు ఎన్నో సమస్యలను ఎదుర్కొని పంట పండిస్తాడు. పండిన పంటను కాపాడుకోవడమూ పెద్ద సమస్యే. పంట చేతికందే సమయంలో ప్రకృతి ప్రకోపిస్తే అంతే సంగతులు. ఇలా అష్ట దిగ్బంధనంలో వ్యవసాయం సాగించే రైతుకు పెట్టుబడి సాయంతో పాటుగా మద్దతు ధర అండదండలు కావాల్సిందే. ఢిల్లీని చుట్టుముట్టిన రైతులు ఇదే అంటున్నారు.

**వ్యవసాయం ద్వితీయ ఆదాయవనరుగా ఉన్నవారి మాటేమో గానీ వ్యవసాయమే జీవనోపాధిగా ఉన్న రైతులకు మాత్రం తప్పనిసరిగా మద్దతు ధర ఉండాల్సిందే. తక్కువ ధరకు పంటను కొనుగోలు చేయాలనుకునే కొనుగోలుదార్లకు, ముఖ్యంగా కార్పొరేట్లకు ఇది కంటగింపుగా ఉంటుంది. బడా వ్యాపారులకు కొమ్ముకాసే కేంద్ర సర్కారు సహజంగానే మద్దతు ధర డిమాండ్‌ను ఒప్పుకోకపోవడంలో వింతేమీ లేదు. అందుకే రైతుల ఆందోళనను అన్నిరకాలుగా అణచివేయాలని చూస్తున్నది. ఓవైపు చర్చల ప్రక్రియను కొనసాగిస్తున్నట్టు కనిపిస్తూనే మరోవైపు మూకుమ్మడిగా రైతులను అరెస్టు చేసి స్టేడియాలు సహా ఇతర ప్రాంతాల్లో నిర్బంధించాలని చూస్తున్నది. కానీ, ఢిల్లీలోని ఆప్ సర్కారు అందుకు సహకరించకపోవడంతో అది కుదరలేదనేది వేరే సంగతి.**

శ్రమదమాదులకోర్చి పండించిన పంటకు కనీస మద్దతు ధరను రైతులు కోరుకోవడం ఏ రకంగా చూసినా సబబే. మార్కెట్ మాయాజాలాన్ని ఎదుర్కోవడంలో ఇదొక్కటే సరైన రక్షణ కల్పిస్తుందని వారి గట్టి నమ్మకం. ఎన్నో రాయితీలు పొందే పారిశ్రామికవేత్తల ఉత్పత్తులకు గరిష్ఠ ధరలుంటాయి. ఎన్నో సమస్యలతో పోరాడుతూ మన ఆకలి తీరుస్తున్న రైతులకు కనీస మద్దతు ధర కల్పించడం ఎంతైనా అవసరం. అందుకు చిత్తశుద్ధితో, నిండుమనసుతో కేంద్రం వారితో చర్చలు జరిపి న్యాయమైన డిమాండ్లు పరిష్కరిస్తే రైతుకు, దేశానికి మేలు జరుగుతుంది.

# మాట పదిలం.. నేతలూ

'నోరు మంచిదైతే.. ఊరు మంచిదవుతుంది' అంటారు పెద్దలు. కానీ, నేటి రాజకీయాల్లో నోటికి ఎంతగా పని చెప్తే అంత గొప్ప అని భావిస్తున్నారు మన నాయకులు. తెలంగాణ ఎన్నికల ఫలితాల అనంతరం కాంగ్రెస్ నాయకుల మాటలే అందుకు నిదర్శనం. ఎన్నికల్లో విమర్శలు, ప్రతి విమర్శలు, ఆరోపణలు, ప్రత్యారోపణలు సాధారణమే. కానీ, కొత్త ప్రభుత్వం కొలువుదీరాక కూడా తెలంగాణలో రాజకీయ వేడి తగ్గడం లేదు. గతంతో పోలిస్తే విమర్శల దాడి కాస్త పెరిగి ఏపీ రాజకీయాలను తలపిస్తుండటం ఆందోళనకరం.



**జీడిపల్లి రాంరెడ్డి**
96666 80051



సాక్షాత్తూ రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి తన స్థాయిని మరిచి బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌పై చేస్తున్న అభ్యంతరకరమైన వ్యాఖ్యలు తెలంగాణ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారుతున్నాయి. కేసీఆర్‌ను ఉద్దేశించి.. 'బొందపెడతాం, గోరికడతాం' అంటూ ఆయన వ్యాఖ్యానిస్తుండటాన్ని చూసి తెలంగాణ సమాజం అసహ్యించుకుంటున్నది. ఈ విద్యలో నాలుగు ఆకులు ఎక్కువే చదివిన అమాత్యులు ఆయనను ఆదర్శంగా తీసుకొని ఇంకా రెచ్చిపోతున్నారు. గతంలో అప్పటి బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ కూడా ఈ తరహాలోనే నోటికి పని చెప్పారు. బీజేపీని జనాల్లోకి తీసుకెళ్లేందుకు ఆయన ఈ మార్గాన్నే ఎంచుకున్నారు. ఏదో ఒకటి మాట్లాడి నిత్యం వార్తల్లో నిలవాలని ఆయన తాపత్రయపడేవారు. ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి తీరు కూడా అలాగే కనిపిస్తున్నది. ఎంతగా తిడితే అంతగా ప్రజల్లోకి వెళ్లగలమని ఆయన భావిస్తున్నారు. బాధ్యత గల పదవుల్లో ఉన్నవారు ఇలా నోటికొచ్చినట్టు మాట్లాడి గ్రామ స్థాయి నేతలకు ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారో మరి.

మన మాటల తీరును బట్టే మనకు మర్యాద ఇస్తారు. పదవి అనేది వ్యక్తికి ఆభరణం కాకూడదు. వ్యక్తే ఆ పదవికి ఆభరణంగా మారాలి. అలా పదవికి వన్నె తెస్తేనే ఆ వ్యక్తి విలువ పెరుగుతుంది. నోటి దురుసుతో చరిత్రలో కలిసిపోయినవారు ఎందరో ఉన్నారనే విషయాన్ని పాలకులు మర్చిపోకూడదు.

తెలంగాణ సాధనలో కేసీఆర్ కీలక భూమిక పోషించారని, దాన్ని ఎవరూ కాదనలేరని గతంలో రేవంత్‌రెడ్డి స్వయంగా చెప్పారు. మరి నేడు అధికారంలోకి రాగానే కండ్లు మూసుకుపోయాయి అనుకుంటా! ముఖ్యమంత్రి నుంచి మొదలుకొని అమాత్యుల వరకు ఏ ఒక్కరూ ఆగడం లేదు. అధికారం శాశ్వతమని భ్రమపడుతూ నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారు. అధికార దర్పాన్ని ప్రదర్శించి ఓటమిని కొనితెచ్చుకున్న ఎందరో హేమాహేమీలు మనదేశంలో ఉన్నారు. చరిత్రే దీనికి సాక్ష్యం.

మాటలెప్పుడూ పొదుపుగా ఉండాలి. అనవసరంగా నోరు జారితే చేటు తప్పదు. నోటి దురుసు కారణంగా రాజ్యాలే కుప్పకూలిన ఉదాహరణలున్నాయి. మాల్దీవుల మంత్రుల ఉదంతం మన కండ్లముందే ఉన్నది. ఇష్టారీతిలో మాట్లాడినవారు తమ పదవులను కోల్పోయారు. కాంగ్రెస్ సర్కారులో తెలంగాణ ఉద్యమంతో సంబంధం లేని వాళ్లే ఎక్కువగా ఉన్నారు. అందుకే వారు ఈ విధంగా వ్యవహరిస్తున్నారు.

టీఎస్‌ను టీజీగా మార్చి, తెలంగాణ తల్లి విగ్రహం, చిహ్నాన్ని మారుస్తానని చెప్తూ.. అదే అసలైన మార్పు అని, ప్రజలు కోరుకున్నది అదేనని రేవంత్‌రెడ్డి భ్రమపడుతున్నారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చాల్సిన ఆవశ్యకత ఏమిటో ఎవరికీ అర్థం కావడం లేదు. తొలుత ప్రజలకిచ్చిన 420 హామీలను నెరవేర్చాలి.

'తెలంగాణ కోసం 5 శాతం శ్రమిస్తే.. సాధించుకున్న తెలంగాణను కాపాడుకోవడానికి 95 శాతం శ్రమించాలి' అని జయశంకర్ సార్ చెప్పిన మాటలను ప్రజలు మరువరాదు. ఉమ్మడి ఏపీని అత్యధికకాలం పాలించిన కాంగ్రెస్‌కు తెలంగాణ రైతులు, ప్రజల కష్టాలు కనిపించవు. ఆ పార్టీ నేతలు తెలంగాణ కోసం పోరాటం కూడా చేయరు. ఆనాడు తెలంగాణకు వ్యతిరేకంగా పనిచేసిన వ్యక్తి నేడు రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం నమ్మశక్యం కాని విషయమే. రాజకీయాల్లో గెలుపోటములు సహజం. ఇప్పటికీ కేసీఆరే ముఖ్యమంత్రిగా ఉండాలని తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నారు. సర్వే చేసినా ఇదే స్పష్టం అవుతుందనడంలో అతిశయోక్తి లేదు.

**ఉమ్మడి ఏపీలో తెలంగాణ అనుభవించిన కరువుకాటకాలు, సాగు, తాగునీటి గోసను అప్పుడే మరిస్తే ఎలా? అన్నం లేక గట్క తిని కడుపు నింపుకొన్న సందర్భాలూ ఉన్నాయి. 'తలాపున పారుతున్న గోదారి.. మన బతుకు ఎడారి.., నాగేటి సాలల్ల నా తెలంగాణ.. నా తెలంగాణ..' తదితర పాటలను మరిస్తే ఎలా? నాటి తెలంగాణ బతుకు చిత్రం ఎంత దుర్భరంగా ఉండె. అయినా నోరు మెదపని నాటి కాంగ్రెస్ నేతలే నేడు పాలకులుగా మారడం మన దౌర్భాగ్యం.**

దయనీయ స్థితిని చూసిన తెలంగాణ తొమ్మిదిన్నరేండ్ల కేసీఆర్ పాలనలో ఎంతగా అభివృద్ధి చెందిందో మనం కండ్లారా చూశాం. నాటి వలసల తెలంగాణకు నేడు ఇతర రాష్ట్రాల కూలీలు వలస వస్తున్నారు. కేసీఆర్ ఏమైనా మాయ చేశారా! అదంతా కేసీఆర్ అందించిన సుపరిపాలన పుణ్యమే కదా.

తెలంగాణను సస్యశ్యామలం చేసిన కేసీఆర్‌పై రేవంత్‌రెడ్డి ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతుంటే బీజేపీ కనీసం స్పందించడం లేదు. తెలంగాణలో కాంగ్రెస్‌కు బీ- పార్టీ బీజేపీయే అన్నది దీన్నిబట్టే అర్థం అవుతున్నది. రేవంత్ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు మండిపడుతుంటే.. బీజేపీ నేతలు తమకేమీ పట్టనట్టు వ్యవహరించడం చూస్తుంటే పరోక్షంగా మద్దతు ఇస్తున్నట్టు తెలుస్తున్నది. ఏది ఏమైనా తెలంగాణకు కేసీఆరే శ్రీరామరక్ష అన్న విషయాన్ని ప్రజలు మరిచిపోకూడదు.

బహుముఖ ప్రజ్ఞాశాలి, బహుభాషా కోవిదుడు, రాజనీతిజ్ఞుడు, సంస్కరణలకు ఆద్యుడు పీవీ. తెలంగాణ బిడ్డగా తన ప్రయాణాన్ని మొదలుపెట్టిన ఆయన దేశ ప్రధాని స్థాయికి ఎదిగిన వైనం ఎందరికో ఆదర్శం. చాలా ఆలస్యంగా భారతరత్నకు ఎంపికైన ఆయన అసలైన 'భారతావని రత్నం' అనడంలో ఎటువంటి సందేహం లేదు. ఆయనకు భారతరత్న పురస్కారం వచ్చిందని తెలియగానే నా మనసు పులకించింది. పీవీతో గడిపిన నాటి క్షణాలు మదిలో మెదిలాయి.

# ఆరోజు పీవీ ఏం చేశారంటే..



అది 1984 సంవత్సరం జూలై మాసం. మా స్వగ్రామం నాగసముద్రాల నుంచి చింతపల్లి భాస్కర్‌రెడ్డి, సురుకొంటి రాఘవరెడ్డి, ఎల్లుమెట్ల మల్లారెడ్డి, మంగళారపు చిన్న మల్లయ్య, పెద్ద సముద్రాల కోనవేన చంద్రయ్యలతో కలిసి నేనూ ఢిల్లీకి వెళ్లాను. అంతకు ముందే భాస్కర్‌రెడ్డి, చంద్రయ్య దుబాయి వెళ్లివచ్చారు. మమ్మల్ని కూడా తీసుకెళ్తామని చెప్పడంతో వారితో పాటు ఢిల్లీకి పోయాం. ఇదిగో వీసా! అదిగో వీసా! అంటుండగానే దేశ రాజధానిలో 14 నెలలు గడిచిపోయాయి. వీసాలు వచ్చాయని ఏజెంట్ల నుంచి ఓ రోజు కబురందింది. రాత్రి 10 గంటలకల్లా నెహ్రూ ప్యాలెస్‌లోని ఆఫీస్‌కు రావాలని వారు చెప్పారు. ఒక్కొక్కరి నుంచి రూ.12 వేల విలువైన డీడీలు, కొంత నగదు తీసుకున్నారు. ఉదయం 4 గంటలకు విమానం ఉందని, రాత్రి 12 గంటలకు ఎయిర్‌పోర్టుకు వెళ్లేందుకు బస్సులు వస్తాయని చెప్పారు. మాతో పాటు తమిళనాడు, కేరళ, పంజాబ్‌లకు చెందిన మొత్తం 40 మంది బస్సుల కోసం ఆఫీస్‌లో వేచి చూస్తున్నాం.

**ఏడాదిగా కండ్లు కాయలుకాచేలా ఎదురు చూసిన కోరిక నెరవేరుతున్నదని, పట్టరాని సంతోషంతో అప్పటికే ఊరికి ఉత్తరాలూ రాశాం. సమయం గడిచిపోతున్నది. బస్సులు రావడం లేదు. ఆఫీస్ సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ప్రధాన ఏజెంట్ ముఖర్జీ మోసం చేసి పారిపోయాడని ఆలస్యంగా తెలిసింది. మరో ఏజెంట్ వరియామ్ సింగ్, సిబ్బంది కూడా అక్కడికక్కడే మాయమైపోయారు. మోసపోయామని అప్పుడు అర్థమైంది.**

కండ్ల వెంట నీళ్లు సుడులు తిరుగుతున్నాయి. అందరం అప్పు చేసే ఢిల్లీకి వెళ్లాం. తీసుకున్న అప్పుపై అప్పటికే ఏడాది వడ్డీ పడింది. మంగళారపు చిన్న మల్లయ్య అయితే 'నేను ఇక్కడే ఏ రైలు కిందనో పడి చస్తా. ఊరికి మాత్రం రాను' అంటూ గొల్లున ఏడ్చాడు. వారం పాటు ఆఫీసు చుట్టూ తిరిగినా ఫలితం కనిపించలేదు. ఆఫీసు మూతపడింది. చేతిలో ఉన్న డబ్బులు అయిపోయాయి. ఏం చేయాలో పాలుపోక ఊరికి బయలుదేరాం. రైలులో కూర్చున్నామే కానీ, మనసులో బాధ తీవ్రంగా కలచివేస్తున్నది. అర్ధరాత్రి 12 అయింది. ట్రైన్ ఆగ్రాలో ఆగింది. అందరూ నిద్రపోయారు. మమ్మల్ని మోసం చేసిన వాడిని ఏం చేయకుండా ఊరికి ఎందుకెళ్లాలన్న ఆలోచన వచ్చింది. వెంటనే రైలు దిగేశాను. ఢిల్లీకి టిక్కెట్ తీసుకున్నాను. తిరిగి ఢిల్లీ చేరుకున్నా. 'చెప్పాపెట్టకుండా దిగేశాను. వారి పరిస్థితి ఏమిటి? నేను చనిపోయానని అమ్మనాన్నలు అనుకుంటారేమో? తప్పు చేశానా?' అనే ఆలోచనలతో చాలాసేపు ఏడ్చాను.

మేం మొదటిసారి కిరాయికి ఉన్న యూసఫ్ సరై కాలనీలో స్థానికుడైన ప్రేమ్ చందర్‌తో నాకు మంచి స్నేహం కుదిరింది. అతన్ని కలిసి జరిగిందంతా చెప్పా. ఎలాగైనా ఆ ఏజెంట్‌ను పట్టుకొని.. మా డబ్బులు, పాస్‌పోర్టులు తిరిగి తీసుకోవాలని వాడితో చెప్పా. రాజకీయ నాయకులు, తెలిసిన పోలీసుల సాయంతోనే అటువంటి మాఫియా గ్యాంగ్‌ను పట్టుకోగలమని అతనన్నాడు. ఆ రోజు రాత్రంతా నిద్ర పట్టలేదు. ఒకటే ఆలోచనలు. ఆఖరుకు ఢిల్లీలో ఉండే పీవీని కలవాలని నిశ్చయించుకున్నా. మరుసటి రోజు పీవీ ఇంటికి వెళ్లాను. అక్కడ బోర్డును చూశాక నాకు తెలిసింది.. ఆయన విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి అని.

మొత్తానికి పీవీని కలిశాను కానీ, ఏం మాట్లాడాలో తెలియలేదు. ఆలోచిస్తూ నిల్చున్నా. 'ఏం బాబు, ఏంటమ్మా' అన్నారు పీవీ. వెంటనే ఆయన పాదాలకు నమస్కరించా. 'సార్ మాది హుస్నాబాద్' అని చెప్పి, జరిగిందంతా వివరించా. పీవీకి హుస్నాబాద్‌కు అవినాభావ సంబంధం ఉంది. పీవీ, హుస్నాబాద్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు స్వయానా వియ్యంకులు. అందుకే లక్ష్మీకాంతరావు పేరు కూడా చెప్పా. 'అంత డబ్బు వాళ్లను నమ్మి ఎలా ఇచ్చారు' అని మొదట మందలించారు. కానీ, అక్కడే అల్పాహారం పెట్టించారు. అనంతరం సార్ పిలిచి తన కారులో పార్లమెంట్ సమీపంలోని పెద్ద భవంతికి తీసుకెళ్లారు. అక్కడ నాతో ఫిర్యాదులు తీసుకున్నారు. అప్పటికే సాయంత్రం 4 గంటలు అయింది. సార్ పిలిచి 'ఎక్కడుంటున్నావు? డబ్బులు ఉన్నాయా?' అని అడిగారు. రెండు రోజుల తర్వాత కనిపించమని చెప్పి, దించి రమ్మని డ్రైవర్‌తో అన్నారు. మరుసటి రోజు ఉదయమే ఏజెంట్ ముఖర్జీ ముంబైలో పట్టుబడ్డాడని వార్తలు వచ్చాయి. వందలాది మందిని మోసం చేసిన ముఖర్జీని పట్టుకోవడంతో చాలా సంతోషించా. 24 గంటలు గడవకముందే అరెస్టు చేయడంతో పీవీ సార్ దాన్ని ఎంత చాలెంజ్‌గా తీసుకున్నారో అర్థమైంది. మనసులోనే ఆయనకు నమస్కరించా.

**మరుసటి రోజు మళ్లీ పీవీ సార్ ఇంటికి వెళ్లాను. 'విచారణ నడుస్తున్నది. కానీ, డబ్బులు తిరిగి ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు' అని అన్నారాయన. మూడు నెలలుగా ఇంటి చుట్టూ తిరుగుతుండటంతో 'పాస్‌పోర్ట్ లేదా సర్టిఫికెట్లు తీసుకురా. ఏదో ఒకటి చేస్తా' అని చెప్పారు. నా దురదృష్టం ఏమిటంటే, పాస్‌పోర్ట్ ఏజెంట్ వద్ద ఉండిపోయింది. సర్టిఫికెట్లు ఊరిలో ఉండిపోయాయి. మొత్తానికి మోసగాళ్లను జైల్లో పెట్టించానన్న తృప్తితో తిరిగి ఇంటిబాట పట్టాను.**

**- మంగళారపు లక్ష్మణ్**